
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
ఆదివారం 21 జూలై 2024



కమ్మేసిన మబ్బులు.. రోజంతా చిరుజల్లులు



సిద్దిపేటలో గొడుగుతో వృద్ధుడు





సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద గొడుగుతో మహిళలు, రోజంతా చిరుజల్లులతో తడిసిన పత్తి చేను

సిద్దిపేట టౌన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 20 : జిల్లాలో శనివారం మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లగా మారింది. సూర్యుడు ముఖం చాటేశాడు. రోజంతా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన వారు గొడుగులు పట్టుకుని కనిపించారు. రెండు రోజులుగా ఊరిస్తున్న వాన శనివారం కూడా మురిపించి ఉసూరుమనిపించింది. రాష్ట్రంలో భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ సూచనలతో ఎదురుచూస్తున్న వరి సాగు రైతులకు మాత్రం నిరాశే మిగిలింది. కానీ, అరకొర వానతో వర్షాధార పంటలైన పత్తి, జొన్న, మొక్క జొన్న, కంది పంటలు జీవం పోసుకుంటున్నాయి. కొందరు రైతులు పత్తిలో కలుపు తీస్తుండగా, ఇప్పటికే పూర్తిచేసిన వారు మందు వేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

● సీపీ అనురాధ సూచనలు




సిద్దిపేట క్రైం, జూలై 20 : డిజిటల్ యుగంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అవగాహన పెంచుకోవాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. సామాజిక మాధ్యమాలలో వినియోగించడంలో జాగురుకతతో మెలగాలని పలు సూచనలు చేశారు.

- స్ట్రాంగ్ , పొడవైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి. వాటిని తరచుగా మార్చాలి
- సోషల్ మీడియా ఖాతాల్లో డేటా గోప్యత సెట్టింగ్ ఉపయోగించాలి. వాటిని ప్రైవేటుగా ఉంచాలి. ఉపయోగంలో లేనప్పుడు కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లను లాక్ చేయాలి
- ఆన్‌లైన్ ఖాతాల కోసం రెండు దశల ప్రమాణీకరణ 2ఎఫ్ఏ ఉపయోగించాలి
- మొబైల్ అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేస్తున్నప్పుడు కాల్స్, కాంటాక్ట్లు, మెసేజ్‌లు, మీడియా లొకేషన్‌లను అనుమతించే ముందు ఆలోచించాలి
- అపరిచితులు పంపిన లింకులు లేదా వెబ్‌సైట్‌లలో పాప్ యాప్‌లను క్లిక్ చేయొద్దు
- అపరిచితులకు సీవీవీతో సహా వ్యక్తిగత సమాచారం ఓటీపీ క్రెడిట్ డెబిట్ కార్డ్ సమాచారాన్ని చెప్పవద్దు
- తప్పుడు సూచనలు చేస్తూ మెయిల్స్‌లో పోర్న్ సైట్లు వీక్షించమని మీకు వచ్చే సందేశాలను నమ్మొద్దు
- మీ స్నేహితులు, బంధువులు లేదా పైఅధికారుల వాట్సాప్ డీపీలతో డబ్బును అడిగినట్లయితే నమ్మకండి
- నమ్మదగని మెయిల్స్ లేదా అటాచ్‌మెంట్‌ను ఓపెన్ చేయొద్దు
- కంప్యూటర్ లేదా మొబైల్‌లో అన్‌వెరిఫైడ్ ప్రోగ్రాంలను ఇన్‌స్టాల్ చేయొద్దు
- ఓపెన్ పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించొద్దు
- పబ్లిక్ ప్రదేశాలలో యుఎస్బీ పోర్టులతో చార్జింగ్ పెట్టకండి
- పార్ట్‌టైం జాబులు లేదా వర్క్ ఫ్రంహోం అని వచ్చే కాల్స్ లేదా సందేశాలకు రెస్పాండ్ అవ్వొద్దు
- స్టాక్ మార్కెట్, ఐపీవోలలో పెట్టుబడి పెట్టే వారు నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల జాగ్రత్త వహించాలి

జిల్లాలో పలువురు ఎస్ఐలు బదిలీ

సిద్దిపేట క్రైం, జూలై 20 : సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న పలువురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్.చంద్రయ్య సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, ఎస్.గోపాల్‌రెడ్డి సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, ఎస్.మల్లేశం సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పోలీస్ కమిషనరేట్‌లోని ఎస్ఐ టి.రవీందర్ సిద్దిపేట సీసీఆర్బీకి అటాచ్ చేశారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న వి.వెంకట్‌రెడ్డి సిద్దిపేట టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎం.కొమురయ్య వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా పోలీస్ కమిషనరేట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఎండీ ఇస్మాయిల్ గౌరారం పోలీస్‌స్టేషన్‌కు, కె.కనకయ్యగౌడ్, సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వ్యాధుల కాలం జర పైలం



● అప్రమత్తతతో సీజనల్ రోగాలు దూరం
● పొంచి ఉన్న డెంగీ, మలేరియా

కొండపాక/సిద్దిపేట అర్బన్ జూలై 20 : వాతావరణంలో మార్పులు రావడంతో వ్యాధులు ప్రబలడం సాధారణం. వర్షాకాలంలో డెంగీ మలేరియా, డయేరియా లాంటివి వస్తుంటాయి. తగు జాగ్రత్తల తీసుకుంటే వాటి బారిన పడకుండా ఉండవచ్చునని వైద్యులు చెబుతున్నారు. వర్షాలకు కొత్తనీరు రావడంతో పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. అలాగే తాగునీటిపై జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాలకు రోడ్లన్నీ బురదమయం అవుతాయి. గుంతలలో నీరు నిలవడంతో దోమలు ప్రబలే అవకాశాలుంటాయి. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లను ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ప్రస్తుత వర్షాకాలంలో పాముల బెడద ఉంటుంది. దాని కోసం పాముకాటు మందును సైతం పీహెచ్‌సీలో సిద్ధంగా ఉంచారు. డయేరియా నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, జింకు టాబ్లెట్స్‌లను అందుబాటులో ఉంచారు.



సిద్దిపేటలో బ్లీచింగ్ వేస్తున్న పారిశుధ్య సిబ్బంది

డయేరియాతో జాగ్రత్త

ఆషాడమాసం వచ్చిందంటే చాలు వర్షాలు పడి పచ్చికపై దోమలు తయారవుతాయి. ఇళ్లలోకి ఈగలు, చిన్న దోమలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఆహార పదార్థాలపై కంటికి కనిపించని దోమలు వాలుతుంటాయి. వీటి వల్ల వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం ఉంది. ఆషాడం, శ్రావణం మాసాల్లో మాంసాహారం, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోకూడదని, ఒకవేళ తీసుకోవాల్సి వస్తే జాగ్రత్తలను పాటించాలని వైద్యులు చెబుతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని పచ్చిక గడ్డి ఉంటే తొలగించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించి పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకుంటే డయేరియాను నివారించవచ్చు.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి



సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి జ్వరం వచ్చినా, డయేరియా లాంటి లక్షణాలు వెంటనే ప్రాథమిక చికిత్స చేయించుకోవాలి. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు అన్ని సబ్‌సెంటర్‌లలో మందులు సిద్ధంగా ఉన్నాయి. కొండపాక పీహెచ్‌సీలో పాముకాటు మందు అందుబాటులో ఉంది.

– డాక్టర్ శ్రీధర్,
కొండపాక పీహెచ్‌సీ వైద్యాధికారి

తీసుకోవాల్సిన చర్యలు

- చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. దాంతో అతిసార వ్యాధిని, ఇతర సీజనల్ వ్యాధులను దూరం చేసుకోవచ్చు
- తీసుకునే ఆహారం, తాగే నీటి విషయంలో జాగ్రత్త వహించాలి. కలుషిత ఆహారం, నీటిని దూరంగా ఉంచడం వల్ల డయేరియా, టైఫాయిడ్ జ్వరం నుంచి రక్షణ పొందవచ్చు.
- డెంగ్యూ, మలేరియా జ్వరాలు సోకకుండా ఉండాలంటే దోమలు కుట్టకుండా దోమతెరలు ఉపయోగించాలి. మురికి గుంతలు లేకుండా నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. ఇళ్లల్లో ప్రతీ శుక్రవారం డ్రై డేను పాటించాలి
- మనం నివసిస్తున్న ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుట్టుపక్కలా ఎక్కడా మురుగు నీరు నిలిచిపోకుండా చూసుకోవాలి
- వీలైనంత వరకు తాజా ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

ఎన్నికల పైసలు ఇంకెప్పుడిస్తారో?

● 'పార్లమెంటు' విధులు నిర్వర్తించిన ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది
● గౌరవ వేతనం, టీఏ, డీఏ కోసం ఎదురుచూపు
● ఇతర జిల్లాల్లో చాలా రోజుల క్రితమే చెల్లింపు
● జనగామ నియోజకవర్గ పరిధిలోనే పెండింగ్

చేర్యాల, జూలై 20 : పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వ్యయాన్ని ఎన్నికల కమిషన్ విడుదల చేసినప్పటికీ జనగామ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇప్పటికీ అందకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ఎనిమిది మండలాలు ఉండగా, సిద్దిపేట జిల్లా పరిధిలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలున్నాయి. రిటర్నింగ్ అధికారిగా జనగామ ఆర్డీవో, ఏఆర్వోగా తహసీల్దారుల పర్యవేక్షణలో ఎన్నికల వ్యయానికి సంబంధించిన లెక్కలు కొనసాగాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తి చేసేంత వరకు రెవెన్యూతో పాటు ఇతరత్రా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించారు. అందుకు సిబ్బందికి టీఏ, డీఏలు, తహసీల్దారు, సెక్టోరియల్ అధికారులకు గౌరవవేతనం అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆయా మండలాలకు సంబంధించిన సెక్టోరియల్ అధికారులకు రూ.7,500 నగదు, అలాగే ఒక్కో తహసీల్దారుకు గౌరవవేతనంతో పాటు వెహికిల్ అలవెన్సు, టీఏలు చెల్లించాల్సి ఉంది. ఉన్నతాధికారులు ఎలాగైనా చెల్లిస్తారన్న ఆలోచనతో అధికారులు, ఇతరత్రా సిబ్బంది ప్రశాంతంగా విధులు నిర్వర్తించారు. ఏర్పాట్లలో పొరపాట్లు తలెత్తకూడదని పలువురు సొంత డబ్బు ఖర్చు చేశారు.

నెలన్నర దాటినా

పార్లమెంటు ఎన్నికలు పూర్తయి నెలన్నరరోజులు గడుస్తున్నా నేటికీ డబ్బు అందించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొరుగు జిల్లాలోని నియోజకవర్గాలలో ఒక్కో తహసీల్దారుకు రూ.30 నుంచి లక్ష వరకు, సెక్టోరియల్ అధికారులకు నిబంధననుసారం తక్షణమే చెల్లించినా, జనగామ నియోజకవర్గంలోనే పెండింగ్ పెట్టారు. ఈ విషయమై తమకు రావాల్సిన డబ్బు అందించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు కోరినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టిన క్రమంలో ఆయా ప్రధాన అధికారులతో పాటు ఎన్నికల విధులు నిర్వర్తించిన వారికి స్థానచలనం పొందితే డబ్బు రావేమోనన్న అయోమయం నెలకొన్నది. ఎన్నికల కమిషన్ ఒకేవిధంగా వ్యవహరించి అన్ని జిల్లాలకు ఇచ్చినా.. జనగామ నియోజకవర్గానికే వ్యయం నిధులు చెల్లించడంలో ఎందుకు జాప్యం వహిస్తున్నారో తెలియడం లేదు. ఇదిలా ఉండగా, ఈ విషయమై ఏఆర్వో వెంకన్నను వివరణ కోరగా తానూ ఎదురుచూస్తున్నానని, వచ్చిన బడ్జెట్ ఖర్చు చేయడం జరిగిందని, ఇంకా కొంతమేర రావాల్సి ఉందన్నారు. మిగతా జిల్లాల వారు మార్చి 31వతేదీలోగా విడుదల చేశారని, ఇక్కడే ఆలస్యం నెలకొందన్నారు. ఎవరు బదిలీ అయినా వ్యయం నిధులు తప్పక వస్తుందని, ఆందోళన చెందాల్సిందేమీలేదన్నారు.

హుస్నాబాద్‌కు కొత్తరూపు

● పట్టణ సుందరీకరణకు రూ.20 కోట్లు మంజూరు
● రూపురేఖలు మారనున్న ఎల్లమ్మ చెరువు
● జంక్షన్ల సుందరీకరణకు నిధులు
● నలుదిక్కులా స్వాగత అర్చీల ఏర్పాటు

హుస్నాబాద్, జూలై 20 : నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ పట్టణం ఇక సుందరంగా మారబోతుంది. వివిధ అభివృద్ధి పనులతో కొత్త రూపు సంతరించుకోబోతుంది. ఇందుకు రూ.36 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఇవే కాకుండా ఈ నిధులకు ముందు మంజూరైన రూ.23 కోట్ల పనులకు టెండర్లను పిలిచారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇటీవల పట్టణ సుందరీకరణ పనులకు రూ.20 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులను ఎల్లమ్మ చెరువుతో పాటు, పట్టణంలోని నాలుగు జంక్షన్ల సుందరీకరణకు వెచ్చించనున్నారు. వీటికి సంబంధించిన డిజైన్లను తయారు చేశారు.

ఎల్లమ్మ చెరువుకు రూ.18 కోట్లు

దాదాపు 2వేల ఎకరాల ఆయకట్టు ఉన్న కాకతీయుల కాలం నాటి హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు రూపురేఖలు ఇక మారనున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దీనిని మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు రూ.6 కోట్లు మంజూరు చేశారు. అయితే ఆ పనులు అనుకున్న మేర జరగలేదు. తర్వాత టూరిజం శాఖ రూ.2.50 కోట్లు మంజూరు చేయగా వాకింగ్ ట్రాక్, లైటింగ్, కట్ట ఆధునీకరణ వంటి పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఎల్లమ్మ చెరువును పర్యాటక స్థలంగా మార్చేందుకు రూ.18 కోట్లు కేటాయించారు. చెరువు బ్యూటీషియన్‌లో భాగంగా ఎంట్రీ అర్చి, చెరువు కట్టకు గ్రాస్, వ్యూ డెక్, మామెంటర్ అర్చ్, గ్లాస్ బ్రిడ్జి, ప్లే ఏరియా, అర్నమెంటల్ పనులతో పర్యాటకంగా తీర్చిదిద్దనున్నారు.

జంక్షన్ల సుందరీకరణకు రూ.2 కోట్లు

హుస్నాబాద్ పట్టణంలోని జంక్షన్లను సుందరీకరించేందుకు రూ.2 కోట్లు వెచ్చిస్తున్నారు. ప్రధానంగా పట్టణంలోని గాంధీ చౌరస్తా, నాగారం రోడ్డు చౌరస్తా, కరీంనగర్ రోడ్డులోని సబ్ స్టేషన్ చౌరస్తా, ఆరెపల్లి చౌరస్తాకు ఈ నిధులు కేటాయిస్తున్నట్లు సమాచారం. జంక్షన్ల సుందరీకరణకు సంబంధించి ఇప్పటికే వివిధ రకాల డిజైన్లు తయారు చేయించారు.



గాంధీ చౌరస్తా సుందరీకరణ డిజైన్



హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తా

రూ.16 కోట్లతో ప్రతిపాదనలు

హుస్నాబాద్ పట్టణ సుందరీకరణ పనుల కోసం మొత్తం రూ. 36 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. మరో 16 కోట్లు మంజూరుకానున్నాయి. ఈ రూ.16 కోట్లతో పట్టణ నలుదిక్కులా స్వాగత అర్చీలను నిర్మించనున్నారు. ఆరెపల్లి పల్లె చెరువును కూడా ఆధునీకరించనున్నారు.

రూ.23 కోట్ల పనులకు టెండర్లు

పట్టణ సుందరీకరణ పనుల నిధుల మంజూరుకు ముందు రూ.23 కోట్లు మంజూరు కాగా ఈ పనులకు టెండర్లను పిలిచారు. వీటితో రూ.7 కోట్లతో కమ్యూనిటీ హాళ్లు, రూ.9 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువలు, రూ.3 కోట్లతో ఎల్లమ్మచెరువు నుంచి శ్మశానవాటిక మీదుగా పందిల్ల కల్వర్టు వరకు బీటీ రోడ్డు, రూ.కోటితో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం వంటి పనులకు వెచ్చించారు. ఇప్పటికే మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మొత్తం మీద హుస్నాబాద్ పట్టణాభివృద్ధితో పాటు ఇక సుందరంగా మారనుండటంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హుస్నాబాద్ సుందరంగా మారబోతుంది



హుస్నాబాద్ పట్టణం సుందరంగా మారబోతుంది. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలోని సుందరీకరణ పనులకు రూ.20 కోట్లను మంజూరు చేయించారు. ఇవే కాకుండా మరో రూ.16 కోట్లు మంజూరయ్యే అవకాశం ఉంది. ఎల్లమ్మ చెరువు, జంక్షన్ల అభివృద్ధి, పట్టణ నలుదిక్కులా అర్చి నిర్మాణం వంటి పనులు జరుగనున్నాయి. ఇవే కాకుండా రూ.23 కోట్ల పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. అందరి సహకారంతో హుస్నాబాద్ పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్

ఘనంగా బోనాల ఊరేగింపు



దుబ్బాక/మిరుదొడ్డి, జూలై 20 : ఆషాడమాసాన్ని పురస్కరించుకుని దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాల్లో రెడ్డి, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం మహంకాళీ బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అట్టహాసంగా ఐఐటీహెచ్ స్నాతకోత్సవం



ఆనందోత్సాహంలో ఐఐటీహెచ్ విద్యార్థులు

● 1,103 మంది విద్యార్థులకు పట్టాలు
● పోచంపల్లి చేనేత వస్త్రాలతో అలరించిన విద్యార్థులు
● ముఖ్యఅతిథిగా నీతి ఆయోగ్ సీఈవో

7 లో

జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయుల నిరసన

బెజ్జంకి, జూలై 20: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సరైన సమయంలో జీతాలు అందడం లేదని బెజ్జంకి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ప్లకార్డులతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన వచ్చే వేతనాలు 20వ తేదీ దాటినా రావడం లేదన్నారు. ప్రతినెలా ఇదేవిధంగా జరుగుతుండటంతో బ్యాంకు ఈఎంఐలు, కుటుంబ ఆర్థిక అవసరాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే 010 ట్రెజరీ ద్వారా ప్రతీనెల 1న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే బదిలీలు, ప్రమోషన్స్, హెల్త్ కార్డ్స్, కారుణ్య నియామకాలు చేపట్టాలని వారు కోరారు. ఈ నిరసనలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఫలారం బండి ఊరేగింపు



దుర్గమ్మతల్లికి ఫలారం బండిని ఊరేగిస్తున్న ఆటిపాముల కుటుంబసభ్యులు

సదాశివపేట, జూలై 20: పట్టణంలో దుర్గమ్మ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పదిరోజుల పాటు సాగే జాతరలో భాగంగా అనవాయితీగా శుక్రవారం రాత్రి పట్టణానికి చెందిన ఆటిపాముల శ్రీకాంత్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో దుర్గభవాని ఫలారం బండి (పట్టు వస్త్రాల-నైవేద్యం) ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో గొర్రెపొట్టేళ్లతో అలంకరించిన అమ్మవారి ఫలారం బండిని, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలను, మహిళల బోనాలను తిలకించారు. భక్తులకు తీర్థ అన్న, ప్రసాదలు, పానీయాలు అందించారు.





ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కాటేజీలు, కొత్తగా నిర్మిస్తున్న కాటేజీలు

అర్బన్‌పార్కు.. మరింత ఆకట్టుకునేలా..

- ప్రారంభానికి సిద్ధంగా కాటేజీలు
- కొత్తగా స్విమ్మింగ్‌పూల్, బంకెట్‌హాల్

నర్సాపూర్, జూలై 20: నర్సాపూర్ ప్రాంతం పచ్చని చెట్లతో అడవులకు ప్రత్యేకం. ముఖ్యంగా హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారిపై ప్రయాణించే వారు పచ్చని చెట్ల మధ్య నుంచి వెళ్తూ అనుభూతిని ఆస్వాదిస్తుంటారు. అటువంటి అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంతో పాటు అటవీ సంపద విశిష్టత తెలియజేయడానికి అర్బన్ పార్కును ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో అర్బన్‌పార్కును చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఈ క్రమంలో పర్యాటకులను మరింత ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లపై అటవీశాఖ దృష్టి సారించింది. పైగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో నర్సాపూర్ అడవులు ఉన్నందున పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తే మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్‌పార్కుకు వచ్చినవారు పార్కు అంతా కలియతిరిగి సేద తీరేందుకు ఇప్పటికే రూ.3 కోట్లతో ఐదు కాటేజీలు, రెండు అతిథిగృహాలు, వంటగది, డైనింగ్‌హాల్, రిసెప్షన్ సెంటర్, వాటర్ ట్యాంకు నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి ప్రైవేట్ వారికి నిర్వహణకు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నారు. ఇవి ప్రారంభమైతే రాత్రిపూట కూడా ఓ వైపు పచ్చని అడవి, మరోవైపు నర్సాపూర్ చెరువు అందాల మధ్య సేద తీరి అక్కడే రుచికరమైన భోజనాలు చేసి వెళ్లే అవకాశం రానున్నది.

15 కాటేజీలు, బంకెట్ హాల్, స్విమ్మింగ్‌పూల్

అర్బన్‌పార్కుకు పర్యాటకుల తాకిడి పెరుగుతుండడంతో వారికి మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడమే కాకుండా.. పూర్తిస్థాయి టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా ఇప్పటికే నిర్మాణం పూర్తయిన కాటేజీలే కాకుండా అదనంగా మరో 15 కాటేజీలు నిర్మాణాలు చేపట్టారు. వీటితో పాటు ఒక బంకెట్‌హాల్, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా పర్యాటకశాఖ నిబంధనల ప్రకారం అన్ని ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇవన్నీ పూర్తయి అందుబాటులోకి వస్తే పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా మారనున్నది.



అర్బన్‌పార్కులో ప్రత్యేకతను చాటుకుంటున్న వాచ్‌టవర్

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

పటాన్‌చెరు, జూలై 20: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటు చేసుకున్నది. సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై పాత టోల్‌గేట్ వద్ద ఉదయం గుర్తుతెలియని (60) ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతదేహాన్ని సంగారెడ్డి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేరస్థులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి: డీఎస్పీ

జహీరాబాద్, జూలై 20: సమాజంలో ప్రతీ వ్యక్తి క్షణికావేశంలో చేసే తప్పిదాలతో కేసుల్లో కూరుకుపోయి భవిష్యత్‌లో ఇబ్బందులు పడుతామనే విషయాన్ని అందరూ గ్రహించాలని జహీబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పస్తాపూర్‌లో గల ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాలకు చెందిన వివిధ నేరాల్లో ఉన్న పలువురితో సమావేశం నిర్వహించారు. రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో, దొంగతనాల కేసుల్లో ఉన్నవారందరినీ పిలిపించి సంతకాలు, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరస్థులందరూ సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అనుకోకుండా ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా ముందస్తుగా వీరందరినీ అదుపులోకి తీసుకుంటామన్నారు. వివిధ నేరాల్లో ఉన్నవారందరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. నేరస్థులు ప్రజలను, అధికారులను ఇబ్బందులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజబోయిన రవి, నయిమోద్దీన్, ఎస్‌ఐలు కాశీనాథ్, ప్రసాదరావు, అరుణ్‌కుమార్, రాజీరెడ్డి, నరేష్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



నేరస్థుల వేలిముద్రలను సేకరిస్తున్న పోలీసులు

నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

వర్గల్, జూలై 20: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం వర్గల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ శనివారం తెలిపారు. ఉమ్మడి మెదక్ (మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి) జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్ సెంటర్, మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అందుకుగాను విద్యార్థి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకంతో కూడిన ధ్రువపత్రాం, ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చివరి 16-09-2024 అని, 18-01-2025 రోజున ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం నవోదయ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

మెరిట్‌కే ప్రాధాన్యత

నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షలో ప్రతిభ ఉన్న విద్యార్థుల మెరిట్ తుది ప్రామాణికమని ప్రిన్సిపాల్ రాజేందర్ చెప్పారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సీటు ఇప్పిస్తామని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని సమాచారం తెలిసిందని, అలాంటివి నమ్మొద్దని తెలిపారు.

'పత్తి చేలల్లో నీరు నిలువకుండా చూడండి'

పుల్‌కల్, జూలై 20: పత్తి చేలల్లో వర్షపు నీరు నిలువకుండా చూడాలని, అధిక వర్షపాతంతో విత్తనాలు కుళ్లిపోయే ప్రమాదముందని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్‌విశ్వకర్మ రైతులకు సూచించారు. చౌటకూర్ మండలం వెంకటకిష్టాపూర్ గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న పత్తి పంటను శనివారం పరిశీలించారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. కొన్నిరోజుల వరకు వర్షాలు లేక ఇబ్బందులు పడిన రైతులకు ప్రస్తుతం కురుస్తున్న ముసురు వాన ఒక రకంగా ఉపయోగకరమేనన్నారు.

కూబాతండాలో తెరుచుకోని పాఠశాల



ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంతో తెరుచుకోని పాఠశాల

నాగల్‌గిద్ద, జూలై 20: మండల పరిధిలోని కూబాతండాలో ఉన్న స్థానిక ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులిద్దరూ రాకపోవడంతో పాఠశాల తెరుచుకోలేదు. ఈ విషయమై తండావాసులు మాట్లాడుతూ తమ తండాకు వచ్చే ఉపాధ్యాయులు సరిగ్గా సమయం పాటించకపోవడంతో పాటు, తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని తెలిపారు. దీనిమూలంగా తమ పిల్లల భవిష్యత్ ఎలా అని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులు సరిగ్గా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

తూప్రాన్, జూలై 20: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రెడ్డిపల్లికి చెందిన గార్ల ఆంజనేయులు(40) వ్యవసాయం, పౌల్ట్రీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య మౌనిక, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



ఐఐటీహెచ్ 13వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న డైరెక్టర్ బీఎస్ మూర్తి


పట్టాలు పొందిన విద్యార్థులు


స్నాతకోత్సవానికి చేనేత వస్త్రాలతో హాజరైన విద్యార్థులు

అట్టహాసంగా ఐఐటీహెచ్ స్నాతకోత్సవం

- 1,103 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం
- నలుగురికి గోల్డ్ మెడల్స్
- ఉత్సవంలో ఉట్టిపడిన స్వదేశీయత
- పోచంపల్లి చేనేత వస్త్రాలతో అలరించిన విద్యార్థులు
- ముఖ్యఅతిథిగా నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం



నీతి అయోగ్ సీఈవోకు జ్ఞాపికను అందజేస్తున్న బీవీఆర్ మోహన్‌రెడ్డి

కంది, జూలై 20: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో 13వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. ఐఐటీహెచ్ క్యాంపస్‌లోని గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆడిటోరియంలో వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నీతి అయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీ.ఆర్.సుబ్రహ్మణ్యం ఐఐటీహెచ్‌లో చదివిన బీటెక్, ఎంటెక్, ఎంటీఏ, పీహెచ్‌డీల్లోని వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 1,103 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. పట్టాలు పొందిన విద్యార్థుల్లో నలుగురు గోల్డ్‌మెడల్స్ సాధించారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తమ పిల్లలు ఐఐటీ డిగ్రీలు తీసుకున్న సందర్భంగా ప్రత్యక్షంగా తిలకించారు. నీతి అయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీ.ఆర్.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. ఐఐటీహెచ్ జపాన్ సహకారంతో ఎన్నో అద్భుతమైన ప్రాజెక్టును చేపట్టిందని ఆయన తెలిపారు. 5జీ, 6జీ టెక్నాలజీతో పాటు పలు రంగాల పరిశోధనల్లో ఐఐటీ-హెచ్ కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. కొత్త ఆలోచనను, వినూత్న పరిశోధనలను ప్రోత్సహించడంతో పాటు పలు వైవిధ్యమైన అంకుర సంస్థలను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ప్రపంచంలో భారతదేశం అద్భుత పురోగతి సాధిస్తున్నదని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపొందడంలో యువశాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. స్నాతకోత్సవం సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి సందేశాన్ని, సంస్థ సాధించిన ప్రగతిని, పరిశోధనల గురించి వివరించారు. అనంతరం ఐఐటీహెచ్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐఐటీహెచ్ ప్రారంభించి దశాబ్దకాలంగా ఆకాశమే హద్దుగా ఎదిగిన తీరును వివరించారు. ఇంటర్ డిసిప్లీనరీలో ఇండస్ట్రీ ఓరియంటెడ్ ప్రోగ్రామ్‌ల ద్వారా తొలిసారిగా గ్రాడ్యుయేట్ బ్యాచ్ పట్టాలు పొందడం హర్షణీయమన్నారు. దేశం గర్వించేలా ఐఐటీహెచ్ శాస్త్రవేత్తల పరిశోధనలుఉన్నాయని ఆయన కొనియాడారు. ఐఐటీహెచ్‌లో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో శాస్త్రవేత్తలుగా పేరే ప్రఖ్యాతలు గడిస్తున్నారని వెల్లడించారు. ఐఐటీహెచ్ విద్యార్థులు రేపటి తరానికి మార్గదర్శకులుగా ఉండాలని ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఐఐటీహెచ్ నెంబర్‌వన్ స్థానంలో నిలవడం ఖాయమన్నారు. గతేడాది నుంచి ఐఐటీహెచ్‌లో ప్రవేశపెట్టిన మూడు కొత్త కోర్సులకు పట్టాలు ప్రదానం చేశారు. అందులో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, ఆన్‌లైన్ ఎంటెక్ ప్రోగామ్‌లకు తొలిసారిగా గ్రాడ్యుయేట్ బ్యాచ్ పట్టాలు పొందడం హర్షణీయమన్నారు. ఐఐటీహెచ్ స్థాపించిన 16 ఏళ్ల నుంచి ఇన్వెంటింగ్, ఇన్నోవేటింగ్ టెక్నాలజీ ఫర్ హ్యూమానిటీతో దూసుకుపోతుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు.

సంప్రదాయ దుస్తుల్లో..

స్నాతకోత్సవానికి విద్యార్థులు, ప్రొఫెసర్ల బృందం పోచంపల్లి చేనేత వస్త్రాలతో హాజరవ్వడంతో స్వదేశీయత ఉట్టిపడింది. ఇప్పటివరకు ఐఐటీహెచ్‌లో నిర్వహించిన ప్రతీ స్నాతకోత్సవానికి పోచంపల్లి చేనేత వస్త్రాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఐఐటీహెచ్ లోగో ముద్రించిన ఎరుపు, నారింజ, ఊదా, ఆకుపచ్చ, నీలం రంగు స్కార్ఫ్‌లతో విద్యార్థులు ఖద్దరు లాల్చి, పైజామాలు ధరించగా, విద్యార్థినులు సంప్రదాయకంగా చేనేత చీరకట్టుతో చూపరులను ఆకట్టుకున్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

ప్రతిష్టాత్మకంగా ఐఐటీహెచ్ నుంచి ఇంజనీరింగ్ పట్టాలు పొందిన విద్యార్థులు అంబరాన్నంటేలా సంబరాలు చేసుకున్నారు. పట్టాలు స్వీకరించిన అనంతరం ముఖ్యఅతిథి, ప్రొఫెసర్లతో గ్రూపు ఫొటోలు తీసుకున్నారు. తాము అందుకున్న పట్టాలు చూపుతూ, స్కార్ఫ్‌లను గాల్లో ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. పట్టాలు పొందిన ఆనంద క్షణాలను తమ తల్లిదండ్రులతో కలిసి సెల్‌ఫోన్లలో సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. దీంతో ఐఐటీహెచ్ ప్రాంగణమంతా విద్యార్థుల కేరింతలతో మార్మోగింది.

వైభవంగా గీతం స్నాతకోత్సవం

- హాజరైన బార్క్లేస్ బ్యాంక్ పూర్వ సీఈవో రామ్ గోపాల్

పటాన్‌చెరు రూరల్, జూలై 20: రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం 15వ పట్టభద్రుల దినోత్సవం (స్నాతకోత్సవం) శనివారం వైభవంగా నిర్వహించారు. గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్ గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి 2023-24 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ కోర్సులు పూర్తిచేసిన 1,490 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ప్రత్యక్షంగా 1,325 మంది, పరోక్షంగా (ఇన్ ఆబ్‌సెన్సియా) 69 మంది పట్టభద్రులకు డిగ్రీలను, 23 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలను అందజేశారు. ఈసీఈ విభాగంతో పాటు బీటెక్ టాపర్‌గా నిలిచిన కె.కీర్తి గీతం అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలను అందుకోగా, పీజీ బెస్ట్ ఆల్ రౌండర్‌గా ఎంబీఏ విద్యార్థి శివకుమార్ శివాంజలి, యూజీ బెస్ట్ ఆల్ రౌండర్‌గా బీఎస్సీ విద్యార్థిని వర్ష మెడైలి నిమ్మకాయల బంగారు పతకాలను అందుకున్నారు. పట్టభద్రులంతా తెల్లని దుస్తులు, ఎర్రని కండువాలతో వచ్చి భారతీయతను చాటారు. బంగారు పతక విజేతలు, పట్టభద్రులు పలువురు గీతమ్‌తో తమకున్న అనుబంధం, అక్కడ ఎదిగిన తీరు, విద్యనభ్యసించేటప్పటి పలు మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పండుగ వాతావరణంలో గీతం 15వ పట్టభద్రుల దినోత్సవం ముగిసింది.



పట్టా అందుకుంటున్న విద్యార్థిని

మహా సముద్ర ప్రాంతాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


మహాసముద్రం గుట్టల ప్రాంతం నుంచి కాలినడకన అధికారులతో వస్తున్న అగ్రవాల్

హుస్నాబాద్‌రూరల్, జూలై 20: ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మహాసముద్రంకు మహర్దశ వచ్చేనా' అన్న కథనంపై మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా అధికారులు స్పందించారు. మంత్రి ఆదేశాల మేరకు శనివారం సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఇరిగేషన్, టూరిజం శాఖల అధికారులతో మహాసముద్రం ప్రాంతాన్ని పరిశీలించారు. మహాసముద్రంలోకి నీరు ఎక్కడి నుంచి వస్తుంది. దీని కెపాసిటీ ఎంత..? గుట్టల పైభాగాన కోట కిలలు, సర్వాయిపాపన్న నిర్మించిన కోట గోడ, పైన ఉన్న దేవతల విగ్రహాలు, నీటి కొలనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా చేస్తే గుట్టల పైభాగానికి వెళ్లేందుకు కావాల్సిన రహదారి, మహాసముద్రంలో బోటింగ్ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మహాసముద్రానికి వెళ్లే దారి గండి పడడంతో పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా అవుట్ ఫ్లో కెనాల్‌పై కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు రూ.18 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి నిధుల మంజూరు కోసం పంపామని ఇరిగేషన్ అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఎట్టకేలకు మహాసముద్రానికి మహర్దశ లభించనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం రాములపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా సాగుచేసిన మామిడితోటను పరిశీలించారు. పోతారం(ఎస్)లో స్త్రీశక్తి మహిళల కుట్టు శిక్షణా కేంద్రాన్ని, నానో ఓవెన్ బ్యాగ్స్, పేపర్‌ప్లేట్స్, గార్మెంట్స్ యూనిట్లను సందర్శించి మహిళల స్వయం ఉపాధిపై ఆరాతీశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఈ ప్రాంతంలో పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట డీఆర్డీవో జయదేవ్ ఆర్య అదనపు డీఆర్డీవో మధుసూదన్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, బంక చందు, చిత్తారి పద్మ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కర్ణాకర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం జి.శ్రీనివాస్, సీసీలు రవీందర్, అశోక్, వీవోఏ కనకతార, యమునా తదితరులు ఉన్నారు.

నర్సరీని సందర్శించిన అదనపు కలెక్టర్

హుస్నాబాద్, జూలై 20: హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ నర్సరీని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ శనివారం సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకంపై సలహాలు, సూచనలు చేశారు. పట్టణంలో మొక్కలు విరివిగా నాటాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం

- ప్రారంభించిన కలెక్టర్ రాహుల్‌రాజ్


కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 20: ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రారంభించి మాట్లాడారు. వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవిస్తూ.. అర్జీలు సమర్పించేందుకు అనునిత్యం కలెక్టరేట్‌కు వచ్చేవారికి సైతం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని భావించి ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ పట్టణాలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సేవా కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీల్లోని వంట గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఈడీఎం మేనేజర్ సందీప్, డీపీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలతో ఆర్థిక భరోసా

యువతీ, యువకులు వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటూ వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా చేకూరుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలోని వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకొని ఉత్తీర్ణులైన వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జి మనిషా, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల పరిశీలన

రామాయంపేట, జూలై 20: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్, స్కూల్ కాంప్లెక్స్ కోసం కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం స్థల పరిశీలన చేశారు. రామాయంపేటలో ఇందుకు కావాల్సిన 20 ఎకరాల ప్రభుత్వ భూమిని చూశారు. నిర్మాణానికి అనువైన మూడు స్థలాలను ఆర్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, తహసీల్దార్‌తో కలిసి పర్యవేక్షించారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తరచూ ప్రమాదాలు జరుగుతున్న బైపాస్ రోడ్డును కలెక్టర్ పరిశీలించారు.


అభినందన సభలో ఎంపీ రఘునందన్‌రావు

జిల్లా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, జూలై 20: సంగారెడ్డి జిల్లా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. అమీన్‌పూర్ బీజేపీ నాయకులు శనివారం బీరంగూడ బాలాజీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన అభినందన సమావేశానికి హాజరై మాట్లాడారు. తన గెలుపులో కీలకపాత్ర పోషించిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు రుణపడి ఉంటానన్నారు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. పట్టణ స్వరూపం సంతరించుకున్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కృషికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు. బీరంగూడ, పటాన్‌చెరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యకు చెక్ పట్టేందుకు మెట్రో రైలు విస్తరణపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ బీజేపీ నాయకులు ఎంపీని ఘనంగా సన్మానించారు. బీరంగూడ బ్రాహ్మణ సంఘం నాయకులు సైతం ఎంపీని సన్మానించి వేదమంత్రాలతో ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్ల రమేష్, ఆదెల్లి రవీందర్, పార్టీ అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు అభినందనీయం

- సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

మునిపల్లి, జూలై 20: మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులోని వోక్సెన్ యూనివర్సిటీలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర పేర్కొన్నారు. శనివారం యూనివర్సిటీలో ఎయిడ్ క్లినిక్ సెల్‌ను ప్రారంభించిన అనంతరం సామాజిక కార్యకర్తలతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, న్యాయ సహాయాన్ని అందిపుచ్చుకోవాలని ప్రజలకు సూచించారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులకు న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సంజీవరావు, డీడబ్ల్యూవో లలితకుమారి, సీడబ్ల్యూసీ మెంబర్ విష్ణుమూర్తి, డీసీపీ రత్నం, వోక్సెన్ లా డైరెక్టర్ డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.



గ్రామానికి వెళ్లేముందు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఏర్పాటుచేసిన గేటు

దిగ్బంధం చెర వీడేదెప్పుడు..?

- పదేళ్లుగా పహారాలోనే ఆ ఊరి బతుకులు
- బంధువులు రావాలన్నా అనుమతి తప్పనిసరి
- పరిహారం కోసం ఏళ్లుగా పడిగాపులు
- పాలకుల చెవికెక్కని గోడు
- ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని గ్రామస్థుల వేడుకోలు

గుమ్మడిదల, జూలై 20: ఆ ఊరు పదేళ్లుగా నిర్బంధంలో ఉన్నది. పరిహారం అందక.. న్యాయం జరగక.. కోర్టు స్టేతో గ్రామంలోని ప్రజలు ఆంక్షల మధ్య బతుకుతున్నారు. చుట్టూ కంచె.. ఊరిలోకి వెళ్లాలన్నా.. బంధువులు రావాలన్నా.. అధికారుల అనుమతి తీసుకోవాల్సిందే. అలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉన్న గ్రామమే దార్గుల్ల. తమ సమస్య పరిష్కరించాలని గొంతెత్తినా పాలకుల చెవికి ఎక్కడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమను పట్టించుకొని న్యాయం చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని దార్గుల్ల, దాచారం గ్రామాలను దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కలిపేందుకు కొన్నేళ్ల క్రితం అధికారులు సర్వేచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించారు. కానీ కొన్ని మిగులు భూములకు, ఇళ్లకు పరిహారం అందించలేదు. దీంతో కొన్నేళ్లుగా ఆయా భూముల్లో రెండు గ్రామాలవారు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. కానీ 2009లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఒక అడుగు ముందుకేసి విస్తీర్ణ పనుల్లో వేగం పెంచారు. ఆ రెండు గ్రామాలను లోపలికి కలుపుకుంటూ చుట్టూ ప్రహరీ నిర్మించారు. గేటు కూడా నిర్మిస్తుండగా రెండు గ్రామాల ప్రజలు పరిహారం అందలేదని ఆందోళన చేశారు. వారి కోరిక మేరకు గేటు నుంచి గ్రామాలకు వెళ్లే విధంగా అనుమతి ఇచ్చారు. 2015 దాచారం గ్రామానికి చెందిన గ్రామస్థులకు జిన్నారం మండలం కిష్టయ్య పల్లెలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లపట్టాలు ఇచ్చి.. బలవంతంగా ఊరిని ఖాళీ చేయించారు. దీంతో ఆ గ్రామస్థులు గత్యంతరం లేక తమ కేటాయించిన ఇళ్లల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండా రేకుల షెడ్లు వేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు.

మేం ఖాళీ చేయం

దార్గుల్ల గ్రామంలోని 120 ఎకరాల భూములకు సంబంధించి తగిన పరిహారం అందలేదని, పరిహారం అందించేవరకూ ఖాళీ చేసేది లేదంటూ గ్రామస్థులు అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆ గ్రామస్థులకు న్యాయం జరిగేవిధంగా చూడాలని స్టే ఇవ్వడంతో అన్నారం ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు దార్గుల్ల గ్రామంలోనే ఉండేవిధంగా వెసులుబాటు కల్పించారు. దీంతో ఊరిలోనే ఉంటూ పనులు చేసుకుంటున్నారు. దాదాపు 50 ఇళ్లు, 300 మందికిపైగా జనాభా కలిగిన దార్గుల్ల గ్రామంలోని ప్రజలు ఇప్పటివరకూ స్టేపైన నివాసముంటున్నారు. పదేళ్లు గడుస్తున్నా పరిహారం అందలేదని, ప్రహరీ మధ్యనే తమ బతుకులు సాగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎవరైనా బంధువులు ఇక్కడి రావాలన్నా.. ఎక్కడికి వెళ్లాలన్నా.. షరతులతో కూడిన అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకుంటున్నారు.


ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ప్రహరీ లోపల నివాసముంటున్న దార్గుల్ల గ్రామం

ఎమ్మెల్యే గారూ.. పట్టించుకోండి

ఎన్నోఏళ్ల నుంచి దార్గుల్ల, దాచారం గ్రామస్థులు పరిహారం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం దక్కలేదని, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పట్టించుకోని మా సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. శనివారం గుమ్మడిదలలో వారు విలేకరులతో మాట్లాడారు. రెంగు గ్రామాల్లోని మిగులు భూములకు పదేళ్లవుతున్నా పరిహారం రాలేదన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్‌రెడ్డి తమ సమస్య పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. మూడోసారి గెలిచి ప్రస్తుతం అధికార పార్టీలో కొనసాగుతున్న మహిపాల్‌రెడ్డి గారు స్పందించి దార్గుల్ల, దాచారం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎయిర్‌ఫోర్స్ కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి, తమ భూములకు మార్కెట్‌తో కూడిన ధరలు అందించే విధంగా కృషి చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో దార్గుల గ్రామానికి చెందిన తుమ్మ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య గ్రామస్థులు మహేష్ సంతోష్, బాజిరెడ్డి, మిల్కారెడ్డి పాల్గొన్నారు.

కోర్టుభవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి



కోర్టు భవనంలోని ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిద్దిపేట జిల్లా జడ్జి రమాదేవి, తదితరులు

చేర్యాల, జూలై 20: చేర్యాల మున్సిఫ్‌కోర్టు భవనాన్ని సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సాయి రమాదేవి శనివారం పరిశీలించారు. కొన్నినెలలక్రితం కోర్టు మంజూరైనప్పటికీ సొంతభవనం లేకపోవడంతో స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రతిపాదించడంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కోర్టు నిర్వహణకు సంబంధించి 27మంది సిబ్బంది నియామకపు ఫైల్ పెండింగ్‌లో ఉండడంతో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు భూమిగారి మనోహర్ ఇటీవల ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రిని కలిసి చర్చించారు. ఆమెవెంట చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ దామోద ర్, న్యాయవాదులు అంకని సురేందర్, ప్రణీత్, రమేశ్ తరులు పాల్గొన్నారు.



ఆషాఢమాసం సందర్భంగా తిప్పారం పాఠశాలలో విద్యార్థులు గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోరింటాకు పెట్టుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గోరింటాకు విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

- కుకునూరుపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు, జూలై 20: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (పీటీఎం) సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు పాఠశాలకు పంపడం ఒక బాధ్యతగా భావించాలన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలలు పటిష్ఠమవుతాయన్నారు. అనంతరం సిద్దిపేటకు చెందిన దాత ప్రమీల ప్రభాకర్ దంపతుల సహకారంతో పాఠశాలలోని 160 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్లా షరీఫ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



జగదేవ్‌పూర్: ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో సరిత, తదితరులు

మూడేళ్ల పిల్లల్ని అంగన్‌వాడికి పంపాలి

జగదేవ్‌పూర్, జూలై 20: మూడేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీకి పంపించాలని ఐసీడీఎస్ గజ్వేల్ ప్రాజెక్ట్ సీడీపీవో సరిత కోరారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవాని, రజిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఆటపాటలతో విద్య

చేర్యాల, జూలై 20: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తున్నామని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ప్రీస్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ పి.స్వరూపారాణి కోరారు. చేర్యాల పట్టణశివారు యాదవనగర్ అంగన్‌వాడీ పాఠశాలలో శనివారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. చేర్యాల మండలం కొత్తదొమ్మాట యూపీఎస్ ఉపాధ్యాయుడు వంగరవేణుగోపాల్ మరో పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈమేరకు శనివారం పాఠశాల విద్యార్థులందరికీ నోటుబుక్‌లు, స్టేషనరీతో పాటు స్టీల్ గ్లాసులను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాశికంటి వెంకటరమణ, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణీ, బాలింత బాధ్యతలు స్వీకరించారు.

లక్ష్య సాధన దిశగా ముందడుగు వేయాలి

గజ్వేల్, జూలై 20: విద్యార్థులు లక్ష్య సాధన దిశగా ముందడుగు వేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, ఇంపాక్ట్ ట్రైనర్ శశిధరశర్మ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీమొద్దీన్‌తో కలసి ఇంపాక్ట్ శిక్షణ తరగతిని నిర్వహించారు. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను కలిగి ఉండాలన్నారు. ఆయనవెంట ఉపాధ్యాయుడు ఊడెం వేమారెడ్డి, ఉపాధ్యాయులు షరీఫ్, బషీరుద్దీన్, కోదండరాంశర్మ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

అక్కన్నపేట, జూలై 20: మండలంలోని పెద్దతండా గ్రామపంచాయతీ పరిధిలోని పంజాగుట్ట తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేక మూడు సంవత్సరాల క్రితం మూతపడింది. తండావాసులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ముందుకురావడంతో శనివారం పాఠశాలను పునఃప్రారంభించారు. పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ప్రసాద్‌రెడ్డి



అక్కన్నపేట: మండలంలోని పంజాగుట్ట కాలనీలో పాఠశాలకు హాజరైన విద్యార్థులు

ఆరుతడి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సిద్దిపేట రూరల్, జూలై20: ఆరుతడి పంటలైన మొక్కజొన్న, కంది, పెసర, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు జక్కు విజయ్, సీహెచ్ పల్లవి రైతులకు సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్, పుల్లూరు, సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామాల్లోని ఆరుతడి పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు, పెసర, కంది, మినుము పంటల్లో చిత్త పురుగు ఆశించడాన్ని గమనించామని, రైతులు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కందిలో పచ్చపురుగు గమనించినట్లయితే క్లోరోపైరీఫాస్ లేదా మోనోక్రోటోఫాస్‌ను పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి


● చేర్యాల వ్యవసాయ అధికారి అఫ్రోజ్

చేర్యాల/నారాయణరావుపేట, జూలై 20: రైతుబీమాకోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని చేర్యాల వ్యవసాయాధికారి ఎండీ అఫ్రోజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత జూన్ 28వ తేదీలోగా పట్టాదారు పాసుబుక్కు పొందడంతో పాటు 14ఆగస్టు 1965 నుంచి 14ఆగస్టు 2006లోగా పుట్టినతేదీ కలిగిన రైతులు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాపాసుబుక్, ఆధార్, నామిని ఆధార్ కార్డ్ ప్రతులతో ఆగస్టు 5వతేదీలోగా తమకు అందచేయాలని సూచించారు.

నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన రైతులు రైతుబీమా 2024-2025 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని నారాయణపేట మండల వ్యవసాయ అధికారి వెంకటరమణి తెలిపారు. ఈ సందర్భగా ఏవో మాట్లాడుతూ.. 2024 జూన్ 28 వరకు డిజిటల్ సంతకం అయిన కొత్త పాస్ పుస్తకం వచ్చిన రైతులు మండల వ్యాప్తంగా 427 మంది ఉన్నారని చెప్పారు.

శాకంబరిదేవిగా కన్యకాపరమేశ్వరి

కుకునూరుపల్లి, జూలై 20: మండల కేంద్రంలో కన్యకాపరమేశ్వరిని శాకంబరిదేవిగా అలంకరించారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆషాఢమాసం సందర్భంగా కన్యకాపరమేశ్వరిని శాకంబరిదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.



శాకంబరిదేవిగా అలంకరించిన కన్యకాపరమేశ్వరి


రాయపోల్ ఎంపీవో సహా పలువురి బదిలీ

రాయపోల్, జూలై 20: రాయపోల్ మండల పంచాయతీ అధికారి లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ ముతాలబ్ బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఎవరూ రాలేదు. అనాజీపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీమాన్‌రెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో పూర్ణచందర్, ఆరేపల్లి కార్యదర్శి రాజేష్ బదిలీ కాగా ఆయన స్థానంలో మౌనిక బదిలీపై వచ్చారు. వడ్డేపల్లి కార్యదర్శి రాధా, ఎల్కల్ కార్యదర్శి జావెద్ బదిలీ కాగా వీరి స్థానంలో కూడా ఎవరూ రాలేదు. ఖాళీగా ఉన్న టెంకంపేట కార్యదర్శిగా శశికుమార్ బదిలీపై వచ్చాడు.

పంచాయతీ కార్యదర్శుల రిలీవ్

మద్దూరు, జూలై 20: మద్దూరు ఉమ్మడి మండలంలోని ఏడు గ్రామ పంచాయతీల సెక్రటరీలు బదిలీ కాగా శనివారం ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ రిలీవ్ ఉత్తర్వులను సెక్రటరీలకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొయినుద్దీన్ ఉన్నారు. జగదేవ్‌పూర్ నుంచి మద్దూరుకు డిప్యుటేషన్‌పై వచ్చిన ఎంపీవో ఖాజామొయినుద్దీన్ యథాస్థానానికి, మద్దూరు నుంచి జగదేవ్‌పూర్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిన ఎంపీవో శ్రీనివాస్‌వర్మ కొమురవెల్లి మండలానికి, కొమురవెల్లి మండల ఎంపీవీ మద్దూరుకు బదిలీపై వస్తున్నట్లు సమాచారం.

హాస్టల్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారు?



ప్రారంభం కాని హాస్టల్ భవనం

దౌల్తాబాద్, జూలై 20: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న 100 మంది విద్యార్థినిల కోసం 2017లో హాస్టల్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి 2021లో నిర్మాణం పూర్తి చేశారు. హాస్టల్ నిర్మాణం పూర్తయ్యి 3 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ప్రారంభించలేదు. హాస్టల్ వసతి లేకపోవడంతో పాఠశాలలో చేరేందుకు సుముఖత చూపడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే హాస్టల్‌ను ప్రారంభించేందుకు చొరవ చూపాలని పాఠశాలవిద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు కోరుతున్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● బీవోబీ మేనేజర్ మౌనిక

వర్గల్, జులై 20: బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను మండల ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని బీవోబీ వర్గల్ బ్రాంచ్ మేనేజర్ మౌనిక కోరారు. బీవోబీ 117వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం వర్గల్ బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమక్షంలో కేకును కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంక్ సేవలు మండలనికే పరిమితం కాకుండ నియోజకవర్గస్థాయిలో విస్తరించామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది రాకేశ్, వెంకటేశ్, వినియోగదారులు విశ్వేశ్వర్‌రావు, నూక బిక్షపతి, పసుల రమేశ్, వెంకట్‌రెడ్డి, సాయిగణేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

గంగు భానుమూర్తి జయంతి వేడుకలు

వర్గల్, జులై 20: దివంగత గంగు భానుమూర్తి జయంతి వేడుకలను శనివారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, నాగరాజశర్మ, ఆలయ ఉద్యోగులు సుధాకర్, పాండుతో పాటు ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

దూళిమిట్ట,జూలై 20: దూళిమిట్ట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రాజుగౌడ్‌ను శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు సన్మానించారు. అనంతరం ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.



కార్యదర్శి రాజుగౌడ్‌ను సన్మానిస్తున్న జీపీ సిబ్బంది, తదితరులు



మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో వాటర్‌ట్యాంపు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుంది. అయినా అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఉన్న వాటర్‌ట్యాంపు పూర్తిగా శిథిలానికి చేరుకున్నా అధికారులు అటువైపు చూసిన దాఖాలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న నీటిట్యాంకును కూల్చివేసి, నూతన వాటర్‌ట్యాంపు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- మిరుదొడ్డి

రోటరీ క్లబ్ గజ్వేల్ సెంట్రల్ అధ్యక్షుడిగా తుమ్మ కృష్ణ

మర్కుక్, జూలై 20: రోటరీక్లబ్ గజ్వేల్ సెంట్రల్ అధ్యక్షుడిగా ఎర్రవల్లికి చెందిన తుమ్మ కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రోటరీక్లబ్ గవర్నర్ హనుమంతరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రోటరీ క్లబ్ గజ్వేల్ సెంట్రల్ సర్వసభ సమావేశం నిర్వహించి నూతన అధ్యక్ష కార్యదర్శిలను ఎన్నుకున్నారు. రోటరీక్లబ్ గజ్వేల్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శిగా రమణాకర్, కోశాధికారిగా నరసింహ యాదవ్, జిల్లా ఎకనామికల్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడిగా రమణ, రోటరీక్లబ్ గజ్వేల్ సెంట్రల్ కల్చరల్ అధ్యక్షుడిగా చంటి, ఆయా కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, బార్ అసోసియేషన్ గజ్వేల్ అధ్యక్షుడు పండారి, రోటరీ క్లబ్ సీనియర్ నాయకులు సత్యనారాయణ, బిక్షపతి, మల్లేశం, వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడి ఎన్నిక

హుస్నాబాద్‌రూరల్, జూలై 19: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడిగా పూదరి రవిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం పట్టణ, మండల స్థాయి కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కొమురయ్య అధ్యక్షతన నిర్వహించి ఎన్నికలు జరిపారు. పట్టణ అధ్యక్షుడిగా పూదరి రవిగౌడ్, ఉపాధ్యక్షులుగా కొయ్యడ శ్రీను, తాళ్లపల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శ్రీను, పట్టణ కోశాధికారిగా పూదరి చంద్రమౌళి, సహాయ కార్యదర్శులుగా పూదరి మహేష్, బండారి వీరస్వామి, చిన్న రవీందర్, మండల కమిటీ అధ్యక్షుడిగా పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మామిడి తిరుపతి, ఉపాధ్యక్షులు బండారి కిష్టయ్యగౌడ్, గాదగోని కొమురయ్య, సహాయ కార్యదర్శులుగా బొమ్మగాని ఎల్లయ్యగౌడ్, కోడూరి మల్లేశం, కోశాధికారిగా సదానందనం గౌడ్ ఎన్నికయ్యారు.

సిద్దిపేట పట్టణ కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట టౌన్, జూలై20: సిద్దిపేట పట్టణ కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ముత్యాల సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చింతల బాలు, కోశాధికారిగా బి. బాలరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, బైరీ శేఖర్, గ్యాదరి మల్లేష్, సంయుక్త కార్యదర్శులుగా అంజియాదవ్, కార్యవర్గ సభ్యులుగా బైరి శ్రీధర్‌యాదవ్, మల్లేష్, సాకి రఘు, గౌరవ సలహాదారులుగా కోట వేణుగోపాల్, గ్యాదరి భూమలింగం, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, శ్రీనివాసచారి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని కేబుల్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని, వారి సంక్షేమానికి పాటుపడతానన్నారు.

బీమా చెక్కు అందజేత

బెజ్జంకి, జూలై 20: మండలంలోని రేగులపల్లెకి చెందిన వాడె సుమలత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకులో ఖాతాదారురాలిగా పీఎంజెజెబీవై స్కీం ద్వారా వచ్చిన బీమా రూ. 2లక్షల చెక్కును శనివారం పీఏసీఎస్ చైర్మన్ శరత్‌రావు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, పాలకవర్గ సభ్యులు నరేష్‌బాబు, తిరుపతిరెడ్డి, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, సూపర్‌వైజర్ దుర్గం, సీఈవో శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పెద్దపీట

● హుస్నాబాద్ ఏసీపీ సతీష్

కోహెడ, జూలై 20: నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేశాయని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, సీసీ కెమెరాలు, ఈవ్‌టీజింగ్ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను విద్యను నేర్పిన గురువులను మరచిపోవద్దని చెప్పారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

గజ్వేల్, జూలై 20: సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని గజ్వేల్ మండల తాజా మాజీ సర్పంచులు కోరారు. ఈ మేరకు గజ్వేల్ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో తాజా మాజీ సర్పంచ్‌లు తూం శేఖర్, తోట లక్ష్మయ్య, బాల్‌చంద్రం, శివయ్య, పాండు, మన్నే శేఖర్, వెంకటేశ్ తదితరులున్నారు.

దళితుల సంక్షేమంపై చర్చించాలి

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్, జూలై 20: దళితుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణలపై అసెంబ్లీలో చర్చించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం రూ.10లక్షలకు బదులు అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12లక్షలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవడానికి మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విడదీసి ఎస్సీ కమిషన్, ఎస్టీ కమిషన్‌లను ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆయనతో నాయకులు చంద్రం ఉన్నారు.

గంజాయి మొక్కను పెంచుతున్న వ్యక్తికి రిమాండ్

చిన్నకోడూరు/దౌల్తాబాద్, జూలై 20: గంజాయి మొక్కను పెంచుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు గ్రామానికి చెందిన భరత్ తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కను పెంచుతున్నాడన్న విశ్వసనీయం సమాచారం మేరకు శుక్రవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు తనిఖీ చేసి గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశారు. శనివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గత నెల 26న ఇండస్ట్రియల్ ఎక్స్‌రోడ్డులో పోలీస్‌లు వాహన తనిఖీల్లో చేస్తుండగా నలుగురు యువకులు పారిపోతుండగా పోలీస్‌లు వెంబడించగా నలుగురిలో ఒకడు తప్పించుకున్నాడు. ఆ ముగ్గురి నుంచి 900 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన నిందితుడు ఉమేష్‌సింగ్‌ను గౌరారం వద్ద అదుపులోకి తీసుకొని గజ్వేల్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్ తెలిపారు.

రాష్ట్ర మత్స్యసొసైటీ ఫెడరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మత్స్యశాఖ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిరుదొడ్డి, జూలై 20: రాష్ట్ర మత్స్యశాఖ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మెట్టు సాయికుమార్‌ను అక్బర్‌పేట-భూంపల్లి కాంగ్రెస్ నాయకులు శనివారం హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, అక్బర్‌పేట-భూంపల్లి ఫిషర్మెన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నరేష్, పరమేష్‌గౌడ్, బిక్షపతి, స్వామి, ప్రభాకర్, నరేష్ తదితరులున్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జూలై 20: గురుపౌర్ణమి సందర్భంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల అభివృద్ధికి, సమాజ వికాసానికి, విద్యా, యోగా, ఆధ్యాత్మిక, ధార్మిక, వైద్య, సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక, నృత్యం, కళలు, క్రీడలు కరాటే లాంటి రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి గురువందనం, గురుబ్రహ్మ గురుశిరోమణి పురస్కారాన్ని అందజేయనున్నట్లు సర్వేజనా సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు ఇఎ్‌సఎస్ నారాయణ తెలిపారు. ఆగస్టు 4, ఆదివారం హైదరాబాద్‌లో ఈ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9652347207 నెంబరుకు సంప్రదించాలన్నారు.

గంటల ప్రాతిపదికన లెక్చరర్ పోస్టులకు..

గజ్వేల్, జూలై 20: గజ్వేల్ పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన తెలుగు సబ్జెక్టు బోధించుటకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపీ తెలిపారు. డిగ్రీతో పాటు బీఈడీ లేదా టీపీటీ పూర్తి చేసి, టెట్ అర్హత గల అభ్యర్థులు ఈ నెల 27లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు.

'నాణ్యమైన భోజనం అందించాలి'



కళాశాలలోని భోజనాన్ని పరిశీలిస్తున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, జూలై20: వైద్య కళాశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సూచించారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు, కళాశాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. కళాశాల ఎదుట ఉన్న పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కలీమొద్దీన్, బుచ్చిరెడ్డి, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహుకరణ

దూళిమిట్ట, జూలై 20: మండలంలోని లింగాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో లింగాపూర్ విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. ఏటీ, టీ గ్లోబల్ కమ్యూనికేషన్ సంస్థ అమెరికా వారు కార్పోరేట్ చారిటీలో భాగంగా అక్కడ ఉద్యోగం చేసి వచ్చిన లింగాపూర్ గ్రామవాసి మారెడ్డి సుధాకర్‌రెడ్డి ద్వారా మూడు కంప్యూటర్లను గ్రామ పంచాయతీ కార్యాలయానికి బహుకరించారు. ఈ సందర్భంగా లింగాపూర్ విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరమ్ సభ్యులు, గ్రామస్థులు ఏటీ, టీ గ్లోబల్ కమ్యూనికేషన్ సంస్థ వారికి, మారెడ్డి సుధాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మారెడ్డి సుధాకర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి, లింగాపూర్ డెవలప్‌మెంట్ ఫోరమ్ సభ్యులు శిరీష, శ్రీనివాస్, ఉదయ్, మహేందర్, సిద్దేశ్వర్, వివోఏ వినోద, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్

● బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 20: ఏకకాలంలో రుణమాఫీపై ప్రభుత్వం మాట తప్పిందని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంకెలతో రుణమాఫీ చేయడం సరికాదని, రాష్ట్రంలో 39లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా, కేవలం 11లక్షల మందినే ఎంపిక చేయడం దారుణమన్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మాట తప్పడంతో పాటు అసత్యాలను ప్రచారం చేస్తున్నదన్నారు. రుణమాఫీ కానీ రైతులు రుణమాఫీ కాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, వానాకాలంలో రైతులు నారుమడితో పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కౌలురైతులకు రూ.15వేల సాయం, ధాన్యానికి రూ.500 బోనస్‌ను ప్రకటించాలని, అన్ని రకాల ధాన్యానికి బోనస్‌ను వర్తింపజేయాలన్నారు.

ప్రతీ రైతుకు రుణమాఫీని వర్తింపజేయాలి

అర్హత ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీని వర్తింపజేయాలని బీజేపీ గజ్వేల్ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి డీసీసీబీ పరిధిలో సుమారు 42వేల మంది రైతులు లక్ష లోపు రుణాలు ఉన్న వారున్నారని, అందులో కేవలం 19,542మంది రైతులకే రుణమాఫీ వర్తించిందన్నారు. రైతులకు ఇచ్చిన మాటను నిలుపుకోవడంలో విఫలమైన కాంగ్రెస్ సంబరాలు ఎందుకు చేసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. వారితో కిసాన్ మోర్చా పట్టణాధ్యక్షుడు సంగెం కరుణాకర్, నాయకులు మల్లేశ్‌యాదవ్, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, తలారి రాజు, మర్కంటి రాములు తదితరులున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మనోహర్‌యాదవ్

రుణమాఫీతో రైతు కుటుంబాల్లో ఆనందం

● డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్

నారాయణరావుపేట, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చేసిన పంట రుణమాఫీతో లక్షలాది మంది రైతు కుటుంబాల్లో ఆనందం నెలకొన్నదని డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ పేర్కొన్నారు. మండలంలోని జక్కాపూర్ గ్రామంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతుల కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తున్నదని, మాయమాటలతో ప్రజలను మభ్య పెట్టే ప్రభుత్వం తమది కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మాట్ల రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల అశోక్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దాసరి ఉమ, మైనారిటీ అధ్యక్షుడు షాదుల్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

● **ములుగు:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్నాసాగర్‌లో శనివారం 25 మంది రైతులకు రుణమాఫీ కావడంతో గ్రామంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మాఫీ చేసి రైతు కళ్లల్లో ఆనందన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, భవికాంత్‌రెడ్డి, యాదగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ములుగు: అన్నాసాగర్‌లో కేక్ కట్‌చేస్తున్న రైతులు, నాయకులు

● **హుస్నాబాద్:** రైతుల ఉసురు తీసిన బీఆర్ఎస్, బీజేపీలకు ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి విమర్శించారు. రైతుల రుణమాఫీని ఏకకాలంలో మాఫీ చేయడం పట్ల జేఏసీ పక్షాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన జేఏసీ నియోజకవర్గ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. మొదటి విడతగా ఒకే రోజు దాదాపు రూ. 7 వేల కోట్లు రుణమాఫీని రైతుల ఖాతాల్లో జమ చేయడం చారిత్మాత్మకమైన నిర్ణయమన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కో ఆర్డినేటర్లు మేకల వీరన్న యాదవ్, డ్యాగల సారయ్య, చెప్యాల ప్రభాకర్, ప్రకాష్, నాయకులు కొయ్యడ కొమురయ్య, వడ్డేపల్లి మల్లేశం, రేణికుంట్ల బిక్షపతి, రాజగోపాల్‌రావు, లక్ష్మన్‌గౌడ్, వీరసోమయ్య, ఫ్రాన్సిస్, కోడం ప్రభాకర్ తదితరులున్నారు.



నారాయణరావుపేట: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

● **మర్కుక్:** ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు కాంగ్రెస్ 2 లక్షలు రుణమాఫీ చేస్తుందని, దీని వల్ల లక్షల రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందని, కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి అని ఎర్రవల్లి తాజా మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతి అన్నారు.

ఏపీజీవీబీలో 749 మంది రైతులకు రుణమాఫీ

మద్దూరు, జూలై 20: మద్దూరు మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో లక్షలోపు రుణాలు పొందిన 749 మంది రైతులకు రుణమాఫీ వర్తించింది. ఈ మేరకు 749 మంది రైతులకు గానూ రూ.4.49 కోట్లు మాఫీ అయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.